# పరామర్శ

- కాకాని చక్రపాణి -

"మీవల్ల ఏ పనీ సక్రమంగా కాదు. ఆ పరమేశ్వరశాస్త్రిగారికి ఒంట్లో బాగుండడంలేదట. వెళ్ళి పరామర్శించి రండీ అని చెవి నిల్లు కట్టుకు పోరుతూనే ఉన్నా. మీ వల్ల కావటంలేదు. రేపయినా వెళ్ళిరండి. ఇంతకీ బాబిగాణ్ణి డాక్టరు దగ్గరకు తీసు కెళ్తున్నారా, లేదా! దానికీ నేనే వెళ్ళాలా?" అంది నిర్మల భర్తతో.

"నీ కెందుకు? నువ్వు నిశ్చింతగా ఉండు. ఇప్పుడే తీసికెళ్తా. వీలయితే పనిలో పనిగా పరమేశ్వరశాస్త్రి ఇంటికీ వెళ్ళి వస్తాను."

"జ్వరం పిల్లాడ్ని తీసుకుని వాళ్ళింటి కెందుకు గాని. ఇవాల్టికి బాబిని డాక్టరుకి చూపించి రండి చాలు. వాడికి అన్నం పెట్టొచ్చో లేదో, మందు ఎన్ని పూటలు ఎలా వేయాలో అన్నీ వివరంగా అడిగి రండి. మర్చిపోకండి."

"సరే సరే నువ్వింతగా చెప్పాలా, నాకు తెలీదూ" అన్నాడు పరమానందం. ఎవరయినా తన కంటే ఎక్కువ మాట్లాడితే బో రనిపిస్తుంది అతనికి. 'ఎందు కీ జనం ఇట్లా మనుమల్ని మాటలతో బాధిస్తారు' అనుకుంటా డతను.

"ఏమో - ఎవరు కన్పిస్తే మాటల్లో పడి మర్చిపోత రేమోనని చెప్పాను" అంది ఆమె.

"నేనా మర్చిపోయేది. జోకు లేస్తావే. మా ఆఫీసులో అందరూ ఎప్పుడు, ఏ జీ.వో. వచ్చిందో గుర్తుండక సలహాలకు నా దగ్గరకు వస్తారు. నే నోసారి జీ.వో. చదివానంటే మర్చిపోవడం ఉండదు. 'ఫలానప్పుడు వచ్చింది కాదయ్యా, ఈ జీ.వో. ప్రకారం నీకు లాభం కలుగుతుంది' అని సలహా ఇస్తాను. 'పరమానందం! నీ జ్ఞాపకశక్తి అద్భుతమయ్యా! ను వ్వుండబట్టే ఈ ఆఫీసు ఇలా నడుస్తోంది' అని నాకు బ్రహ్మరథం పట్టేస్తుంటారు మా ఆఫీసువాళ్ళు. ఓసారి ఏ మయిందంటే..."

"అయ్యో మహానుభావా! మీ సోది ఆపి బయలుదేరుత రా, లేదా? జ్వరంతో పిల్లవా డక్కడ ఎక్కువసేపు కూర్చోలేడు. కనిపించిన వాళ్ళతో కబుర్లలో పడక వెంటనే తిరిగి రండి."

"సరే పదరా బాబీ! మీ అమ్మ ఒట్టి అసహనం మనిషి" అని తన ఐదేళ్ళ కొడుకుతో ఆసుపత్రికి బయలుదేరాడు పరమానందం.

ఆ లోకాలిటీలో అ దో పెద్ద నర్సింగ్‌హోం-కం-డిస్పెన్సరీ. డాక్టరు కమలాకరరావు హస్తవాసి మంచిది. అందువల్ల ఆయన ఆసుపత్రి ఎప్పుడూ చాలా రష్‌గా ఉంటుంది. కాంపౌండర్ దగ్గర తన వరుస నెంబర్ తీసుకుని కొడుకుతో బల్ల మీద కూర్చున్నాడు పరమానందం. అరగం టైంది. తన వంతు ఎప్పుడు వస్తుందో, ఇంకా ఎంతసేపు పడుతుందో అని అసహనంగా కూర్చున్నాడు అతను. వచ్చిన రోగులు ఎవరి బాధల్లో వాళ్ళున్నారు. ఎవరితోనూ మాట్లాడకుండా ఉండటం అతనికి కష్టం. జీవితంలో ఆ బోరు భరించలేడు అతను. అక్కడికీ పక్కన కూర్చున్న వ్యక్తిని పలకరించ ప్రయత్నించాడు పరమానందం. - "ఏం జబ్బండీ మీకు?" అని.

మొహం చిట్లించా డతను. "నా కేం జబ్బు! నాకేం జబ్బు లేదు" అన్నా డతను. 'జబ్బు' అంటే అ దేదో పెద్ద రోగమో, మహమ్మారో అన్నట్టు విన్పించింది అతనికి.

"మరెందు కొచ్చినట్టు..."

"ఎందు కొస్తారయ్యా ఇక్కడికి, డాక్టరుని చూట్టానికి"

"మరేం జబ్బు లేదన్నారు...?!"


"మళ్ళీ జబ్బంటావు! అయినా నా సంగతి నీ కెందుకయ్యా! నువ్వొచ్చిన పనేదో నువ్వు చూసుకోరాదూ?" అన్నా డతను కసరినట్టు.

అతని వంక జాలిగా చూశాడు పరమానందం. 'ఇ దో మెంటల్ కేసు లాగుంది. పాపం. ఎక్కువ వయసు కూడా లేదు. ఏం బాధలో ఏమో' అనుకున్నాడు పరమానందం మనసులో. అతనికి మానవ జాతి పట్ల విపరీతమైన సానుభూతి. జనం చాలా విషయాలు తెలియక బాధపడిపోతుంటారు. వీలయితే చేతనయినంత తను సాయం చేయాలన్న మనస్తత్వం అతనిది. కాని ఈ ప్రపంచం మానవ సహృదయతను సరిగ్గా అర్థం చేసుకోదే అన్నదే అతని బాధ. ఆ వ్యక్తి సరిగ్గా మాట్లాడినట్లయితే జబ్బు, దాని నిర్వచనం, అది రావటానికి మూలకారణం, వచ్చినప్పుడు రోగి ఎలా నడుచుకోవాలి వగైరా మహత్తర విషయాల గూర్చి చక్కటి లెక్చర్ ఇవ్వాలని అతని అభిప్రాయం. కాని ఈ ప్రపంచంలో నగం జనానికి అసహనం. మంచి మాట వినరు. రోగిష్టి మొహాలు. పొరుగు మనిషితో మాట్లాడకుండా అంటీ ముట్టనట్టుంటారు.

అంతలో డాక్టర్ కన్సల్టింగ్ రూంలోనుండి బయట కొచ్చాడు పరమేశ్వరశాస్త్రి. 'వీడి దుంప తెగ! వీ డెప్పుడు వచ్చాడు ఇక్కడకు! అరగంట నుండి తనక్కడ కూర్చునే ఉన్నాడు గాని కన్పించనే లేదు" అతన్ని చూడగానే వెయ్యి కాండిల్ బల్బులా వెలిగింది పరమానందం ముఖం. అంగుళంన్నర పెరిగింది అతని ఛాతీ. ఊపిరి ఆడని ప్రదేశంలో నుండి ఆరుబయలులో పడ్డట్టయింది.

"వోయ్ వోయ్ పరమేశ్వరశాస్త్రీ! రారా! చూసి చాలా కాలమయింది" అని పలకరించి పక్కకు జరిగి అతన్ని కూర్చోమని ఆహ్వానించాడు.

పరమేశ్వరశాస్త్రి పరమానందాన్ని చూడగానే బిక్కచచ్చిపోయాడు. 'ఇవాళ ఈ కాన్నిబల్ పాలబడ్డాడు తను. తన్నింక భోంచేయక మానడు కాక మానడు వాడు. రోజు కో ఘటం వెళ్ళదీయకపోతే నిద్ర పట్టని మనిషి పరమానందం. వీణ్ణించి పారిపోవటానికే పక్క పోర్షన్లో అద్దెకుండే తను దూరంగా వేరే ఇంట్లోకి మారింది. ఇవాళ వీడి హింస భరించాల్సిందే! విధి బలవత్తరమైంది' అనుకుంటూ, మొహమాటంతో ఆ మాటలు పై కనలేక పరమానందం పక్కన కూర్చున్నాడు పరమేశ్వరశాస్త్రి. మొహమాటానికి పోతే ఏదో అయిందట. మొహమాటానికి పోయే జనం ప్రమాదాలు కొని తెచ్చుకుంటారు. ఆ మంచితనమే ఇవాళ పరమేశ్వరశాస్త్రిని పరమానందానికి బలిపశువు చేసింది.






"అవునూ, ఈ మధ్య నీకు ఒంట్లో బాగుండటంలేదని విన్నా! ఏమయింది? ఎప్పట్నించో అనుకుంటున్నా మీ ఇంటికొచ్చి నిన్ను పరామర్శించి వద్దామని, మా ఆవిడా అంటోంది. కాని కుదిరి చావటం లేదు. అసలే తీరిక లేని బతు కయింది. పొద్దున్నే లేవటం ఎదిరి చావదు కదా! లేచి, న్యూస్‌పేపరు చూస్తానో లేదో ఆఫీసుకు టయిమయిపోతుంది. ఇహ హడావుడి. సాయంత్రం అలా మిత్రులతో బాతాఖానీ చేసి ఇంటి కొచ్చేటప్పటికి రాత్రి పది గంట లయిపోతుంది. భోజనం చేసి పడుకునేటప్పటికి పన్నెండు గంటలు. ఇంక పెందరాడే మెలకువ రావాలంటే ఎలా వస్తుంది! అది సరే - ఇప్పుడు డాక్టరు దగ్గర కెందుకొచ్చావు! ఇంకా వంట్లో కులాసా చిక్కలేదా?"

"ఛాతీలో నెప్పిగా ఉంటోందోయ్ ఈ మధ్య" అన్నాడు పరమేశ్వరశాస్త్రి.

"ఛాతీలో నెప్పా? కుడివైపా, ఎడంవైపా? ఈ కాలంలో చాలామందికి గుండె జబ్బు లొస్తున్నాయి. మనం తినే తిండిలో వస ఏముంది? పట్టి చెత్త తిండి తింటున్నాం. సూపర్ తిండ్లు కాదూ? ఆఁ గుండె జబ్బంటే జాగ్రత్తగా ఉండాలి. నూనె వాడకం తగ్గించు. నెయ్యి అసలు వేసుకోకు. ఫాట్ కంటెంట్ ఒంటికి మంచిది కాదు. కోల్లోస్ట్రల్ ఎక్కు వవుతుందట. కొవ్వు గుండెలో చేరి దాన్ని పని చెయ్యనివ్వదు. దాంతో మనిషి టపా కట్టెయ్యం ఖాయం. అవునూ! సిగరెట్లు మానేశావా? నీ ముఖం నిన్ను చూస్తుంటే కనిపించటంలా, సిగరెట్లు మానలేదని. అమ్మో స్మోకింగ్ గుండెజబ్బు వాళ్ళకు చాలా ప్రమాదకారి. కొంపలు తీసే మహమ్మారి. దాన్ని గురించి చెప్పాల్సింది ఏం ఉంది! మా బావగారు తెల్సుగా నీకు. సిగరెట్లు తాగి తాగి వచ్చాడు మహానుభావుడు. అక్కడికీ నేను చెవు నిల్లు కట్టుకుని పోరుతూనే ఉన్నా, విన్నాడా? 'పోగాలం దాపరించినవాళ్ళు అరుంధతినీ, మిత్ర వాక్యాన్నీ దీప నిర్వాణ గంధాన్నీ కనరు, వినరు, మూర్కొనరు' అని ఆ చిన్నయసూరి చెప్పనే చెప్పాడు. నా మాట పెడచెవిన పెట్టాడు. రెండు ఊపిరితిత్తులూ చెడిపొయ్యాయి. చెడవభస్తయ్యా పొగగొట్టంలా ఒకటే పొగ వదులుతూంటే..."

"ఎప్పుడు పోయా డాయన? మనిషి దిట్టంగానే ఉండేవాడే... అనడిగాడు పరమేశ్వరశాస్త్రి పరమానందం వాక్ప్రవాహానికి అడ్డొస్తూ.

"చూపుల కలా కనిపించేవాడు. ఎంత బలమైన మనిషయినా ఈ పొగ తాగే అలవాటుంటే పీనుగయిపోడూ. ముఖ్యంగా గుండె జబ్బున్న వాళ్ళు దాని జోలి కెళ్ళకూడదు. ఆ మధ్యే దో అమెరికన్ పత్రికలో చదివాను. అధిక శాతం గుండె జబ్బుతో పోయినవాళ్ళు పొగ తాగే అలవాటు ఉన్నవాళ్ళేనట. అప్పుడప్పుడూ బార్‌కి వెళ్ళే అలవాటు కూడా ఉందిగా నీకు. తాగుడూ మంచిది కాదు. అదీ మానెయ్యాలి. గుండె జబ్బంటే ఏదో మామూలు రోగ మనుకునేవు. ఉన్నట్టుండి మనిషిని లేపేస్తుంది అది. ఇంకో విషయం. గుండె జబ్బున్నవాళ్ళు మనసులో ఏ వర్రీలు పెట్టుకోకూడదు. కూతురికి పెళ్ళి సంబంధం కుదరలేదని దిగులు పెట్టుకోమాక! ఆ శుభ ఘడియ రావాలి దేనికయినా! మన చేతిలో ఏముంది కనకా! ఆ పైవాడి ఆలోచనలు ఎట్లా ఉన్నాయో! మనం బాధపడి చేసేదేముంది కనకా..."

"లేదులే పరమానందం! దానికి సంబంధం ఖాయమైంది. ఆ దిప్పుడు నాకు సమస్య కాదు. వచ్చే నెల్లో ముహూర్తం పెట్టుకున్నాము" అన్నాడు పరమేశ్వరశాస్త్రి నీరసంగా.

"ఆహా... శుభవార్త. మంచిదే. కాబోయే అల్లు డేం చేస్తున్నాడు? ఆస్తిపాస్తు లేం ఉన్నాయేం? నువ్వు చెప్పనక్కరలేదులే! మంచి సంబంధం కాకుంటే నువ్వు ఒప్పుకుంటావా! నీ సంగతి నాకు తెలీదు, ఏ విషయంలోనూ రాజీ పడని మనిషివని. ఏదయినా ఒక్క విషయం గుర్తుంచుకో. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. ఏ రోజు ఎలా ఉంటుందో ఏం చెప్పగలం? ముఖ్యంగా గుండె జబ్బు సంగతి చెప్పాల్సింది ఏముంది? ఆస్తి పంపకాల పత్రాలు ఇప్పుడే రాసి పెట్టు. మళ్ళీ రేపొద్దున పిల్లలు కొట్టుకు ఛస్తారు. తరువాత ని న్నంటారు. 'మా నాయన ఏదీ సరిగా చేయలేదని.' మా మేనమామ విషయంలో అలానే యింది.

ఆయనకీ హార్ట్ కంప్లైంటే. ఎంత వయసు ఉంటుందనీ, మహా ఉంటే అరవ య్యుంటాయేమో. పుటుక్కున పోయాడు. రాత్రి పడుకున్నవాడు మర్నాడు పొద్దున లేవలేదు. కొడుకులు కొట్టుకుని కోర్టు కెక్కారు. అక్కడికీ బతికుండగా నేను చెబుతూనే ఉన్నా. నా మాట వింటేనా. ఈ గుండె జబ్బుల్ని నమ్మలేం. అందుకే ముందు జాగ్రత్త తీసుకోవాలని నెత్తీ నోరూ బాదుకుని చెప్పేది. మా స్నేహితు డొక డున్నాడు. వాడికీ హార్ట్ కంప్లైంటే! ఆఫీసు నుండి ఇంటి కొచ్చాడు. స్నానం అదీ చేసి టి.వి. చూస్తున్నాడు. భార్య భోజనానికి రమ్మంది. భోజనానికి కూర్చున్నాడు. భార్య ఏదో చెప్తూనే ఉంది, మొదటి ముద్ద కలుపుకుని నోట్లో పెట్టుకున్నాడు. అంతే. ఆ ముద్ద కూడా మింగుడు పడిందో, లేదో. గుండె ఆగిపోయింది. పక్కకి పడిపోయాడు. అంత పెద్ద సంసారాన్ని నట్టేట్లో ముంచి వెళ్ళాడు. ఆవిడ నానా బాధలు పడుతున్నది పిల్లల్ని పైకి తీసుకురావటానికి..."

ఇలా పరమానందం వాగ్ధరి సాగిపోతూనే ఉంది. అతని మాటలు వింటున్న పరమేశ్వరశాస్త్రికి గాబరా పుట్టింది. 'డాక్టరు గుండె జబ్బు లేదన్నారే, ఏమో ఈయన సరిగ్గా పరీక్షించాడో, లేదో...' అనిపించింది. అసలు తన గుండె కొట్టుకుంటున్నదా, లేదా అన్న అనుమాన మొచ్చింది అతనికి. అక్కడికీ మాట పెగుల్చుకుని అన్నాడు - "డాక్టరు నాకు గుండె జబ్బు కాదన్నా డయ్యా! గాస్ ట్రబులట" అని.

"ఇదుగో పరమేశ్వరశాస్త్రీ! ను వ్విలా మోసపోకు. ఈ డాక్టర్లకేం తెలుసు. గాస్ ట్రబులూ, గుండె జబ్బూ రెండూ కలిసి కూడా రావచ్చుట. నా అనుమానం నీకు గుండె జబ్బునే. కావాలంటే ఇంకో డాక్టరుకు కూడా చూపించుకో. బెటర్ - హార్ట్ స్పెషలిస్ట్. మా ఆఫీసులో రామదాసు ఇలాగే మూర్ఖత్వం చేశాడు. 'ఛాతీలో నెప్పె'నేవాడు. 'డాక్టరుకు చూపించుకో లేదా' అన్నా. చూపించుకున్నానండీ, గాస్ ట్రబుల్. అంతకంటే ఏం లేదన్నాడు' అనన్నాడు. 'లేదయ్యా! ఇంకా పెద్ద డాక్టర్లకు చూపించుకో. నీకు గుండె జబ్బే. నా మాట నమ్ము' అన్నాను. వినలేదు. ఏమయింది? ఆఫీసులో టైపు చేస్తున్నవాడు అక్కడి కక్కడే టైపు మిషనుమీద ఒరిగిపోయాడు. ఉద్యోగం చేస్తూ పోయాడు కాబట్టి ఆఫీసు వాళ్ళు కొడుక్కి తండ్రి ఉద్యోగ మిచ్చారులే. అయినా పోయిన మనిషిని తీసుకురాగలమా మనం. డబ్బు కిబ్బంది లేదు సరే, ఇంటికి పెద్దయినవాడు పోతే ఆ కుటుంబం వీధిన పడ్డట్టే! రేపు ను వ్వేమయినా అయితే..."

ఇలా పరమానందం అప్రతిహతంగా మాట్లాడుతూనే ఉన్నాడు. పరమేశ్వరశాస్త్రి తనకు గుండె జబ్బే అన్న నిర్ధారణ కొచ్చాడు. కూతురి పెళ్ళి వచ్చే నెల్లో పెట్టుకున్నాడు. ఆ కార్యం గట్టెక్కిందాకా నయినా ఉంటాడా, లేదా తను? పరమానందం చెప్పినట్టు తను తన దేవ చూసుకుంటే భార్య ఎంత ఇబ్బంది పడాల్సి వస్తుందో? ఖాయం చేసుకున్న ఆ సంబంధం చెడిపోతుందేమో? మళ్ళా మంచి సంబంధం కుదరాలంటే కష్టం. తను లేకపోతే పిల్ల పెళ్ళి సంగతి ఎవరు పట్టించుకుంటారు? కొడుకులు తల్లి మాట వింటారా? తను గుటుక్కుమంటే, తన కొంప కుక్కలు చింపిన విస్తరి అవుతుంది. ఇలా ఆలోచిస్తుండగానే అతనికి పళ్ళంతా విపరీతమైన చెమట పట్టింది. పరమానందం చెప్పినట్టుగా, తను పోయినట్టు తన భార్య పడే తంటాలు, కలిసిరాని కొడుకులు అన్నీ ఊహించుకుంటుంటే అతని గుండె కలుక్కుమన్నట్లయింది. తల తిరిగింది. కళ్ళు మసకలు కమ్మాయి. అతను స్పృహతప్పి పక్కకి ఒరిగిపోయాడు.

దాంతో రోగులతో నిండిన ఆ హాల్లో పెద్ద గోలయింది.


"డాక్టర్! డాక్టర్...!" అ నెవరో అరిచారు.

డాక్టరు హడావుడి పడుతూ వచ్చాడు. పరమేశ్వరశాస్త్రిని బల్లమీద పడుకోబెట్టారు. డాక్టర్ పల్స్ చూసి వెంటనే ఇంజక్షన్ ఇచ్చాడు. స్మెల్లింగ్ సాల్ట్ వాసన చూపించాడు. రెండు నిమిషాల తరువాత స్పృహలో కొచ్చాడు పరమేశ్వరశాస్త్రి.

"ఇహ లేవయ్యా లే, నీకేం ఫరవాలేదు..." అన్నాడు డాక్టరు.

"లేదండీ డాక్టరుగారూ! నా గుండె ఆడటం లేదండీ. నేను చచ్చిపోయానండీ. మా ఆవిడ ఆడది సంసారాన్ని ఎట్లా లాక్కొస్తుంది మహా ప్రభో..." అని గోలగా ఏడవటం మొదలెట్టాడు పరమేశ్వరశాస్త్రి.

"నిజమేనండీ! ఇతని గుండె ఆడుతున్నట్లు నాకూ అనిపించటం లేదు డాక్టరుగారూ! ఒకసారి గుండె ఆగిపోయి కూడా ఎక్కడో కొన ప్రాణంతో స్పృహలో కొచ్చిన మనుషులను చాలామందిని నేను చూశాను. పైగా వీడు సిగరెట్లు తాగుతాడు. బార్‌కీ వెళతాడు. గుండె ఎప్పుడో ఆగిపోయి ఉండాలి డాక్టరుగారూ! మళ్ళీ పరీక్ష చేయండి.



ఒసారి ఏమయిందంటే..." అని వరమానందం ఇంకా చెప్తూనే ఉన్నాడు.

"ను వ్వెంక నోరుమ్మూస్తావా? డాక్టరువు నువ్వా, నేనా? అతని గుండె బాగానే పని చేస్తున్నది. అతనికి గుండె జబ్బేం లేదు" అన్నాడు డాక్టరు.

"మ రెందుకు పడిపోయాడు..." అన్నాడు వరమానందం అనుమానంగా డాక్టరు వంక చూస్తూ.

"మీ బోరు భరించలేక! గుండె జబ్బు కథలు చెప్పి అతని గుండె పని చేయకుండా చేశారు తమరు..." అన్నాడు - అక్కడ జమకూడిన పేషెంట్లలో ఒకతను. అతను పక్కనే కూర్చుని వరమానందం మాటలు వింటూ ఉన్నాడు. వినగా వినగా అతనికీ అనుమాన మొచ్చింది - 'తన శరీరంలో గుండె ఉందా! అది కొట్టుకుంటూ ఉందా?' అని.

"ఇదుగో నా పేషెంట్లని ఇలా బాధించే అధికారం నీ కెవరిచ్చారు? నువ్వు వెంటనే బయటకు నడువు..." అన్నాడు డాక్టరు.

"అయ్యో! నేనూ పేషెంటునే నండీ..." అని గోల పెట్టాడు వరమానందం.

"అవును. నీ కేమయింది? బాగానే ఉన్నావుగా. నరే ముందు నీ సంగ తేదో చూసి మిగతా వాళ్ళను చూస్తాను. లేకపోతే వీ ళ్ళందర్నీ నీ మాటలతో స్పృహ తప్పించేట్టున్నావు" అని అక్కడి కక్కడే వరమానందాన్ని పరీక్ష చేయసాగాడు డాక్టరు. స్టెతస్కోపుతో గుండె, ఊపిరితిత్తులు పరీక్ష చేశాడు. నాలుక చూపించమన్నాడు. కళ్ళు పరీక్ష చేశాడు.

"నీరసంగా ఉంటోందా..." అడిగాడు డాక్టరు.

జనం అంతా చుట్టూ మూగి ఉండటం, పరమేశ్వరశాస్త్రి అలా స్పృహ తప్పిపోవటం చూసిన వరమానందం అయోమయంలో పడిపోయాడు. నిజంగానే ఒంట్లో నీరసంగా ఉన్నట్లనిపించింది. కాళ్ళు లాగుతున్న ట్లనిపించింది.

"అవును డాక్టరుగారూ! నీరసంగా ఉంటోంది. కాళ్ళు లాగుతున్నట్లుంటాయి. రక్త మేమన్నా తక్కువ ఉందంటారా? ఎనీమిక్ అవుతున్నానేమోనని నాకు భయంగా ఉంది..."

"నరే నరే అవు! ఈ మందులు వాడి, వారం రోజుల తరవాత కనపడు" అని నిల్చునే ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు డాక్టరు.

లేచి బయలుదేరుతూ - "వస్తాను పరమేశ్వరశాస్త్రీ! నిన్ను మీ ఇంట్లో ఆటోలో దిగవిడిచి, నే వెళ్తాను" అన్నాడు వరమానందం.

"అత న్నొదిలెయ్! ఇంకాస్సేపు రెస్ట్ తీసుకోనీ! నువ్వు నా ఫీ జిచ్చి ఇహ బయలుదేరు" అన్నాడు డాక్టరు.

జేబులోంచి పది రూపాయల నోటు తీసిచ్చి బయలుదేరాడు వరమానందం.

ఆసుపత్రి దాటుతుండగా పిల్చాడు కొడుకు - "నాన్నా! నాన్నా!" అని.

"ఒరే ను వ్వెలా వచ్చావురా ఇక్కడకు. ఇంత చిన్నపిల్లాడివి ఎలా తిరిగితే తప్పిపోవూ? ఆఁ. మీ అమ్మ కెట్లా బుద్ధి లేదంట. ని న్నిట్లా ఒంటరిగా వదిలేసింది" అని కొడుకు చెయ్యి పట్టుకు నడవసాగాడు వరమానందం. అతని మనసు ఆనంద తరంగితమై ఉంది. క్యూలో ఎక్కువసేపు కూర్చోకుండా డాక్టరును తన దగ్గరకే రప్పించుకుని ట్రీట్‌మెంట్ తీసుకున్నాడు. తను నిజంగా తెలివి గలవాడు. ఈ వెధవ ప్రపంచంలో తన తెలివితేటలు గుర్తించేవాళ్ళు లేక గానీ, లేకపోతే తనపాటికి ఎన్ని గొప్ప పదవులు అధిష్ఠించగలిగేవాడని.


ఇలా కలల్లో తేల్తూ ఇంటి కెళ్ళిన వరమానందాన్ని భార్య అడిగింది.

"ఏమన్నాడు డాక్టరు?" అని.

"ఏమన్నాడు. పరీక్ష చేశాడు. 'నీకేం జబ్బు లేదయ్యా' అన్నాడు. 'కొంచెం నీరసంగా ఉంటోంది, కాళ్ళు లాగుతుంటాయి' అన్నాను. మందులు రాసిచ్చి, మళ్ళా ఓ వారం రోజుల తరువాత కనపడమన్నారు. ఆసుపత్రిలో పరమేశ్వరశాస్త్రి కనిపించాడు. అతనికి ఒంట్లో బావుండలేకపోతే పరామర్శించడానికి వెళ్ళలేదని ఒకటే గోల పెడుతున్నావుగా! పలకరించాను. మనిషికి గుండె జబ్బు. ఎంత కాయమో, ఏమో చెప్పలేం! ఎందుకయినా మంచిది. జాగ్రత్త పడమని హెచ్చరించాను...

అవునూ! అది నరే! బాబిగా ణ్ణిలా రోడ్డుమీద వదిలేశావేం? తప్పిపోతే వెతకలేక చచ్చే చావయ్యేది కాదూ? పిల్లలకు వాళ్ళకేం తెలును. రోడ్డుమీద ఏదో విచిత్రం కనపడుతుంది. ఏ పెళ్ళి బాజాలో, ఏ ఎనౌన్స్‌మెంటో పిల్లలు దాని వెంట పడి వెళ్తారు, తప్పిపోతారు. పిల్లల్ని ఎలా పెంచాలో తెలీకపోతే ఎలా? ఇల్లాలి బాధ్యతల్లో ముఖ్యమైన దది..." అని 'ఇల్లాలు-బాధ్యతలు' నే మహత్తర విషయంమీద ఉపన్యాసం ఇవ్వబోయాడు వరమానందం.

ఇంటావిడకు పరిస్థితి అర్థమైపోయింది. మతిమరుపు భర్తతోడి సంసారంలో ఆమె తల



ఫొటో - పి. నగేష్

బొప్పికట్టింది.

"ఇహ సోది ఆపండి. బాబిగాడు తప్పిపోవట మేమిటి? అసలు మీరు ఆస్పత్రి కెందుకు కెళ్ళారు? జ్వరం వచ్చింది బాబిగాడికి. వాడిని డాక్టరుకు చూపించటానికి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. వాడిని చూపించటం పోయి, మీరు చూపించుకు వచ్చా రన్నమాట! నా ఖర్మకొద్దీ దొరికారు మీరు! మిమ్మల్నసేం ప్రయోజనం? మిమ్మ ల్నంటగట్టిన మా వాళ్ళ ననాలిగానీ" అంది ఆమె నెత్తి బాదుకుంటూ.

"అవును కదూ! గేటు బయట బాబిగాడు 'నాన్నా!' అని పిలవంగానే, వీ డెందుకు నన్ను వెతుక్కుంటూ వచ్చాడా అనుకున్నాను. భలే గమ్మత్తయిందే! మా ఆఫీసులో ఇలాగే ఓసార్రి..."

"ఆపండి. ఆపండి" అని భర్తతో అని - "ఒరే బాబీ! నువ్వయినా మీ నాన్నకు చెప్పకూడదూ, నీకు జ్వరం వస్తే ఆసుపత్రికి వచ్చామనీ" అని అడిగింది ఆమె కొడుకుని.

"డాక్టరు ఇంజక్షన్ ఇస్తాడని భయమేసింది అమ్మా!" అని సమాధాన మిచ్చాడు వాడు.

"ఒరే! భయ మెందుకురా! నేను భయపడ్డానా! నరే పద, ఆసుపత్రికి వెళ్ళి వద్దాం..." అన్నాడు వరమానందం.

"చేసిన నిర్వాకం చాల్లేగాని, ఇంట్లో ఉండండి. నేను వాడిని డాక్టరుకు చూపించుకు వస్తాను" అని, నిర్మల కొడుకుని తీసుకుని బయలుదేరింది.

"పరమేశ్వరశాస్త్రిని పలకరించి రా, ఎలాగో వెళ్తున్నావు" అన్నాడు వరమానందం.

"నర్సింగ్ హోంలో జాయినయ్యాడా?"

"లేదు. బయట పేషెంట్లు వెయిట్ చేసే హాల్లో బల్లమీద పడుకునున్నాడు. నాతో మాట్లాడుతున్న మనిషి విరుచుకుపడిపోయాడు..."

"తెలిసీ, జబ్బు పడ్డ మనిషిని పరామర్శించి రమ్మనమని చెప్పటం నాదే బుద్ధి తక్కువలేండి. మీరు మాట్లాడిం తరువాత ఆ మనిషి ఇంటి, కెందుకెళ్ళి ఉంటాడు. నర్సింగ్ హోంలో జాయినయి ఉండాలి. నేను గుండె దిటవు మనిషిని కాబట్టి బండలా బతికున్నాను కాని, ఇంకెవరో అయితే ఈపాటికి పరలోక ప్రయాణం కట్టి ఉండేవాళ్ళే..."

"నీ ముఖంలే... ను వ్వెప్పుడూ అలాగే ఉంటుంటావు. అంతంత పెద్ద పెద్ద డైలాగు లెందుకు చెప్తావు. వినీ వినీ నాకు బోరనిపిస్తుంది అని ఎన్నిసార్లు చెప్పినా నీకు లెక్కలేదు. మనిషి కాలం చాలా విలువైంది. అది దృష్టిలో పెట్టుకుని, మనిషి జీవించాలి..." అని - 'మనిషి-కాలం విలువ' అనే మరో అద్భుత విషయాన్ని గుర్చి ఉపన్యసించబోయాడు కాని, అతని భార్య వినకుండా తలుపు విసురుగా వేస్తూ, కొడుకుని తీసుకుని ఆస్పత్రికి వెళ్ళిపోయింది.

"మనుషులకు అసహనం ఎక్కువైపోయింది. ఇతర్ల మాటలు వినే ఓపిక ఎవరికీ లేకుండా పోతోంది. వాళ్ళు మంచికై చెప్పినా వినే బుద్ధి లేకుండా పోయింది. వెధవ లోకం, వెధవ లోకం అనీ..." అనుకుని కుర్చీలో వాలాడు పేపరు తీసుకుంటూ వరమానందం. ★